# క్వాడ్ సామ్రాజ్యవాదుల మరొక ప్రమాదకర మృత్యు వ్యూహం

**మనదేశ** ఆర్ధికవ్యవస్థలోని ప్రతిరంగంపై అదుపు సాధించేందుకు, దోపిడీ సాగించేందుకు భారతదేశ దళారీపాలకులు సామ్రాజ్యవాదులకు ప్రత్యేకించి అమెరికాకు కావలసిన సేవలన్నీ అందిస్తూ వస్తున్నారు. అమెరికా ఆధిపత్య రధచక్రాలకు మనదేశాన్ని కట్టివేస్తూ కాంగ్రెస్ పాలన చాలా దూరం ప్రయాణించింది. కాంగ్రెస్ చెప్పులలో కాళ్ళుదూర్చిన బిజెపి ప్రభుత్వం, ఇవే విధానాలను మరింత వేగంగా, దూకుడుగా ముందుకు కొనసాగిస్తోంది. 1991లో మొదటి గల్ఫ్ యుద్ధ కాలంలో ముంబయిలో అమెరికా యుద్ధ విమానాలకు ఇంధనం నింపి ఆ యుద్ధాలలో భారతదేశం పరోక్ష భాగస్వామి అయింది. 2001 సెప్టెంబర్ 11న ప్రపంచ వాణిజ్య కేంద్రం జంట భవనాలపై దాడుల అనంతరం అమెరికా 'టెర్రరిజం పోరు' పేరున గల్ఫ్‌పై సైనిక దాడులకు పాల్పడింది. ఆ సందర్భంలో అమెరికా యుద్ధ నౌకలను భారతీయ ఓడ రేవులలోకి అనుమతించి భారత ప్రభుత్వం వారికి సహకరించింది.

కాగా, 2002 సం॥లో బిల్ క్లింటన్ అమెరికా దేశాధ్యక్షుడిగా వున్న కాలంలో భారతదేశంతో కీలకమైన ఒక రక్షణ ఒప్పందం చేసుకుంది. అది – 'జనరల్ సెక్యూరిటీ ఆఫ్ మిలటరీ ఇన్‌ఫర్మేషన్ అగ్రిమెంట్' (జిసోమియా) దీని తర్వాత మరో 3 కీలకమైన రక్షణ, సైనిక ఒప్పందాలు గత నాలుగు సం॥ల కాలంలోనే జరిగాయి.

2016 సం॥లో సైనిక బలగాల మధ్య అనుసంధానం బలపడేలా 'లాజిస్టిక్ ఎక్స్‌ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్' ('సైనిక సరఫరాల మార్పిడి ఒప్పందం' – లెమోవా) చేసుకుంది. అమెరికా భారతదేశాన్ని తన పెద్ద రక్షణ భాగస్వామిగా ప్రకటించింది. అమెరికా యుద్ధ విమానాలు భారత్‌లో దిగేందుకు, వాటికి అవసరమైన మరమ్మత్తులు ఇక్కడ చేపట్టేందుకు, ఇంధనం నింపుకునేందుకు, ఇరుదేశాల సాయుధ బలగాలు పరస్పరం సేవలు అందించుకునేందుకు ఈ ఒప్పందం ఉద్దేశించబడింది.

2018లో అమెరికాతో భారత ప్రభుత్వం 'కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్' (కోంకాసా) చేసుకుంది. 2020 అక్టోబర్ 26న భారతదేశం అమెరికాతో 'బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కో ఆపరేషన్ అగ్రిమెంట్' (బెకా) చేసుకుంది. అమెరికాకు సైనికంగా భారత్‌ను మరింత ముడివేసే ఒప్పందమిది.

భారతదేశం 'QUAD'లో చేరటం కూడా దీనిలో భాగమే. ఈ చర్యలు, భారత–అమెరికా సంబంధాలను, ద్వైపాక్షిక సంబంధాలను దాటి ఆసియా – పసిఫిక్ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవటానికి అమెరికా చేపట్టిన వ్యూహాత్మక కార్యకలాపాలతో భారతదేశాన్ని బంధిస్తాయి.

2007లో ఆస్ట్రేలియా, జపాన్, భారతదేశం, అమెరికా దేశాల అత్యున్నతస్థాయి సమావేశంలో 'క్వాడ్' ప్రకటన చేశారు. **(ఈ నాలుగు దేశాలనూ కలుపుతూ గీచిన రేఖలు చతుర్భుజి – క్వాడ్రిలేటరల్ – ఆకారంలో వుండటంతో దీనిని 'క్వాడ్' అని పిలుస్తున్నారు.)**




ఆసియా–పసిఫిక్ ప్రాంత దేశాలలోని ప్రజానీకం ఈ ప్రాంతంలో శాంతి, రక్షణలు కలిగివుండాలనీ, ఈ ప్రాంత సముద్ర జలాలలో ఎలాంటి అడ్డంకులూ లేకుండా నౌకాయానం సాగించే స్వేచ్ఛను, హక్కును కలిగి వుండాలని హృదయపూర్వకంగా కోరుకుంటారు. ఈ ప్రాంతంపైన, ఈ ప్రాంతంలోని సముద్ర మార్గాలపైన ఆధిపత్యం చెలాయిం చాలనుకునే సామ్రాజ్యవాద దేశాల వలన ఈ ప్రాంతం, ఈ ప్రాంత సముద్ర జలాలు ఇప్పటికే ఉద్రిక్తతలు, పోటీలు, సమీకరణల కార్యక్షేత్రంగా మారిపోయింది.

చైనా పెట్టుబడిదారీ తరహా అభివృద్ధి పంధాను ఎంచుకున్నప్పటి నుండి ప్రపంచంలో తన సంబంధాలను, ఆర్ధిక వాణిజ్య కార్యకలాపాలను విస్తృతం చేసుకోవటంలో; ఆసియా – పసిఫిక్ ప్రాంతంలోని దేశాలతో, ఆ ప్రాంత సముద్ర జలాలతో తన సంబంధాలను విస్తృతం చేసుకోవటంలో నిమగ్నమై వుంది. ఒకవైపున, ఈ ప్రాంతంలోని దేశాల విధానాలను ప్రభావితం చేయటానికి అన్నివిధాలా ప్రయత్నిస్తూనే, ఈ ప్రాంతంమీద, ఈ ప్రాంత సముద్ర మార్గాలపైనా ఆధిపత్యం చెలాయించే శక్తుల ప్రయత్నాలపట్ల తన వ్యతిరేకతను పదేపదే ప్రకటిస్తూ వుంది.

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా ముందుకొచ్చిన అమెరికా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంపైన, ఆ ప్రాంత సముద్ర మార్గాలపైన తన ఆధిపత్యాన్ని చెలాయించేందుకు వ్యూహాత్మక పధకాలతో ముందుకు సాగుతున్నది. (భారత్‌ను తన వైపు లాక్కునే ప్రయత్నాల్లో భాగంగానే 'ఆసియా – పసిఫిక్' ప్రాంతాన్ని 'ఇండో పసిఫిక్' ప్రాంతం అని అమెరికా మార్చింది.) జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, డిగోగార్షియా మరియు ఇతర దీవులలో అది దశాబ్దాలుగా తన సైనిక స్థావరాలను నిర్వహిస్తూ వస్తున్నది. అది జపాన్, ఆస్ట్రేలియాలతో వ్యూహాత్మక కూటమిలో వుంది. అది ఇతర దేశాలను తన రెక్కల క్రిందకు, తన ప్రభావంలోకి తెచ్చుకునే విధంగా చుట్టుముడుతున్నది. అమెరికా సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని కూడా తమ వ్యూహాత్మక కూటమిలోకి అదేవిధంగా అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో

కూడిన 'క్వాడ్' లోకి లాగారు. ఈ సం॥రం నవంబర్‌లో అరేబియా మహాసముద్రం, బంగాళాఖాతంలలో జరిగిన యుద్ధనౌకా విన్యాసాలలో భారత్‌–అమెరికా – జపాన్ – ఆస్ట్రేలియా దేశాలు పాల్గొన్నాయి. భారతదేశ భౌగోళిక స్వరూపం, విస్తృతి, సుసంపన్నమైన తరగని వనరులు కారణంగా వారి ఆధిపత్య వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ఎంతగానో ఉపయోగకరంగా వుంటుందని భావిస్తున్న కారణంగా, భారతదేశంపై పట్టుకోసం వారు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు.

ఈ నాలుగు దేశాల మంత్రుల స్థాయి సమావేశం 13 సంవత్సరాల అనంతరం 2020 అక్టోబర్‌లో టోక్యోలో జరుపుకొని 'క్వాడ్'ను పునరుద్ధరించారు. ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన స్వాతంత్ర్యానికి, వివాదాల పరిష్కారానికి విధి విధానాలతో కూడిన నిర్వహణ తన లక్ష్యమని ఆ సమావేశం ప్రకటించుకుంది. అయితే అమెరికా దీనిని చైనాకు వ్యతిరేకంగా ఉద్దేశించిన ఆసియాకు చెందిన 'నాటో'గా పరిగణిస్తోంది. 'క్వాడ్ ప్లస్' పేరుతో అమెరికా ఇప్పటికే వియత్నాం, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, బ్రెజిల్, ఇజ్రాయిల్‌లను కలుపుకుంటోంది.

భారతదేశాన్ని శక్తివంతమైన చైనా వ్యతిరేక స్థావరంగా మార్చేందుకు, ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో తమ ఆధిపత్య కార్యకలాపాలను ముందుకు నెట్టేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు ఆతృతతో వున్నారు. చైనా వ్యతిరేక కార్యకలాపాలలో మనదేశం కూరుకుపోయేకొలదీ, అమెరికాపై మనదేశం ఆధారపడే పరిస్థితి మరింత పెరుగు తుందని, దీనితో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోనూ, ప్రపంచంలోనూ తమ ఆధిపత్య వ్యూహాలలో మనదేశాన్ని ఉపయోగించటం మరింత సులువు అవుతుందని వారు భావిస్తున్నారు. ఈ కారణంగానే చైనాతో మనదేశ సంబంధాలు చెడిపోవటంపట్ల వారు చాలా ఆసక్తితో వున్నారు. భారత – చైనా సరిహద్దుల వెంట ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలు, చిన్నపాటి జగడాలు, తన్నులాటలపట్ల వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూనే వున్నారు. ఉద్రిక్తతలను నివారించటానికి, గొడవలను నిరోధించటానికి, సానుకూలమైన ఒప్పందాలు చేసుకోవటానికి చేసే ప్రయత్నాలపట్ల వారు తమ అసహనాన్ని వ్యక్తం చేయకుండా వుండలేకపోతున్నారు. చర్చలనేవి సంపూర్ణంగా నిరుపయోగమైనవని వారు భారతదేశాన్ని బాహాటంగా హెచ్చరించారు కూడా. చైనాను పూర్తిగా ధ్వంసం చేయటంలోనే నిజమైన, శాశ్వతమైన పరిష్కారం ఇమిడివుందని, దీనికి సంసిద్ధం కావాలని భారత పాలకులకు వారు నిరంతరాయంగా బోధిస్తూ వస్తున్నారు. భారత్, చైనాల నడుమ లేదా భారత్, పాక్‌ల నడుమ ఉద్రిక్తతలు, విబేధాలు, యుద్ధతరహా పరిస్థితులు కొనసాగుతూవుండటం – భారతదేశంపై తమ పట్టును వూపిరి సలపనీయకుండా మరింత బలోపేతం చేయటానికి విస్తారమైన మార్గాలను కల్పిస్తుందని అమెరికా ఆలోచిస్తోంది.

'క్వాడ్'లో భాగస్వాములమైన మనం గతంలో ఎప్పటికంటే మరింత చొరవతో వ్యవహరించాలి. చైనా కమ్యూనిస్టుపార్టీ దోపిడి, అవినీతి, దౌర్జన్యాల నుంచి మన భాగస్వాములను, ప్రజలను కాపాడు కునేందుకు మనమంతా కలిసికట్టుగా వ్యవహరించాలి' అని 2020 అక్టోబర్ 9వ తేదీన అమెరికా విదేశాంగ శాఖామంత్రి మైక్‌పాంపియో మాట్లాడారు. అంతకు ఒకరోజు ముందు మరోచోట మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో, స్వేచ్ఛా వాణిజ్యంలో కోత విధించేందుకు "సారూప్య ఆలోచనకలిగిన ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకుంటున్నారు" అన్నారు. స్వేచ్ఛాయుత ప్రపంచానికి, చైనా ఆధిపత్య వాదానికి నడుమనున్న విబేధాన్నే మొత్తం విబేధంగా అతను చిత్రించాడు.

చైనా చాలాకాలంగా పెట్టుబడిదారీ పంథాను అవలంబిస్తుందని అమెరికా నాయకులకు తెలుసు. అయినప్పటికీ వారు చైనాను కమ్యూనిస్టు దేశంగా చూపిస్తారు. కమ్యూనిస్టు వ్యతిరేక భావోద్వేగాలను ఉపయోగించుకోవటం, అలాగే కమ్యూనిస్టు వ్యతిరేక ప్రాతిపదికపై ఇతర దేశాలను తమ వెనుక సమీకరించుకోవటం వారి ఎత్తుగడలో ఒక భాగం.

చైనా శక్తివంతమైన ఆర్థిక, రాజకీయ, సైనికశక్తిగా ఆవిర్భవించటాన్ని; ప్రపంచమార్కెట్లలోకి చైనా తన భారీ పెట్టుబడులు, సరుకులు, సాంకేతిక నైపుణ్యాలతో విస్తృతంగా ప్రవేశించటాన్ని; ఇప్పటి వరకు సామ్రాజ్యశక్తుల ఆధిపత్యంలో వుండి, వారు అదుపుచేసి, దోపిడిచేసుకునే మార్కెట్లను కూడా ఆక్రమించే చైనా దూకుడు తత్వాన్ని – అమెరికా నాయకులు జీర్ణించుకోలేకపోతుండటం అసలు సమస్య. ఇది వారికి ఓ గంభీరమైన, వాస్తవికమైన విచారకారకంగా వుంది. వారి స్థావరంగా ఆక్రమించుకున్న లేదా గుత్తాధిపత్యం వహించిన లేదా పరిగణిస్తున్న మార్కెట్ మినహా, 'స్వేచ్ఛా మార్కెట్' అంటే మరేమీ కాదు. తమ భూభాగంలోకి ఓ పెద్ద పోటీదారునిగా చైనా ప్రవేశించటం వారిని మరింత ఆర్థిక వత్తిడులకు గురిచేసి వారి పరపతి లేదా అదుపులను గొప్పగా బలహీనపరుస్తుందని వారు భీతి చెందుతున్నారు. అమెరికా ఇప్పటికే ఈ తాకిడికి గురవుతున్నది.

అదేవిధంగా, ప్రపంచదేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, శాంతి, భద్రత, సౌభాగ్యాల పరిరక్షకులుగా అమెరికా నాయకులు తమకు తాము చెప్పుకునేది శిఖరస్థాయి అబద్ధం. అమెరికా సామ్రాజ్యవాదులు ఇతర దేశాలను దురాక్రమించి వాటిని బుగ్గిచేసి, విశాల స్మశాన వాటికలుగా వాటిని దిగజార్చటం ప్రపంచాని కంతటికీ తెలుసు. లక్షలాదిమందిని వారు హతమార్చారు; ఆ దేశాలను, వనరులను బలప్రయోగంతో ఆక్రమించారు; ఆపై వారి కీలుబొమ్మ ప్రభుత్వాలను అక్కడ స్థాపించారు. అసంఖ్యాక దేశాల స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ఆయాదేశాల ప్రాదేశిక సమగ్రతలను అతిక్రమించి వారు తమ దురాక్రమణలు సాగించారు. అనేక దేశాలలో ప్రభుత్వాలను వారు కూలద్రోశారు; సాయుధ తిరుగుబాట్లను చేయించారు; నాయకులను హత్యలకు

గురిచేశారు; చిన్న, బలహీనదేశాలపై బాంబులవర్షం కురిపించారు; బలప్రయోగంతో దేశాలను విభజనలకు గురిచేశారు; ఆయా దేశాలలో టెర్రరిస్టు గుంపులకు అన్నివిధాలా సహాయ, సహకారాలందించి మార్గదర్శకత్వం వహించారు. ఇదంతా కేవలం ఆయా దేశాల ప్రజానీకం తమ సుసంపన్నమైన సంపద, వనరులతో వారికి లొంగివుండనందునే! ఏదేని దేశంలో ప్రభుత్వాల పాలన నిరంకుశమైనదా, ఫ్యూడల్, ఫాశిస్టు తరహాలో వుందా అనే దాని గురించి సామ్రాజ్యవాదులేనాడూ పట్టింపుతో లేరనే విషయం ప్రపంచానికంతా తెలుసు. సామ్రాజ్య వాదులకు లొంగి జీవించటానికి ఏదేశంలోని ప్రజలైనా అంగీకరిస్తే, వారి స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక ప్రపంచంగా పిలవబడే దానిలో వారిని లేదా ఆయా దేశాలను కలుపుకోవటానికి వారికి అభ్యంతరమేమీ వుండబోదు. అమెరికా, దాని మిత్ర కూటమిలోని దేశాలకు – చైనాకు నడుమనున్న విబేధాన్ని, స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక ప్రపంచానికి, చైనీయుల ఆధిపత్యవాదానికి మధ్య విబేధంగా ప్రకటించటం పూర్తిగా ప్రక్కదోవపట్టించేది; మోసపూరితమైంది. వివిధ ప్రపంచదేశాల సంపదలపై, వనరులపై అదేవిధంగా ప్రపంచ మార్కెట్‌పై తన పట్టును నిలబెట్టుకుంటూ, మరింతగా తన ఆధిపత్యాన్ని విస్తరించుకొనే ప్రయత్నాలను అమెరికా సాగిస్తోంది. వీటిని తాను ఆక్రమించటానికి, ప్రపంచ మార్కెట్‌ను తనకనుకూలంగా ప్రభావితం చేసుకోవటానికి చైనా ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి ఇక్కడే ఈ రెండింటి మధ్య విబేధాలు, పోటీ వ్యక్తమౌ తున్నాయి. ఆధిపత్యవాదానికి తాను వ్యతిరేకమని, తాను ఆధిపత్య, విస్తరణవాద కాంక్షలను అనుసరించబోనని చైనా పదేపదే ప్రకటిస్తోంది. అదే సమయంలో ఆసియా – పసిఫిక్ దేశాలపై, ప్రజలపై అమెరికా ఆధిపత్య విధానాల ప్రభావాన్నీ, అమెరికా వెనుక సమీకరించుకునే ప్రయత్నాలను వ్యతిరేకించటానికి చైనా చేపట్టిన పద్ధతులు సందేహాస్పదమైనవి; ప్రశ్నించదగినవిగా వున్నాయి.

శాంతి, భద్రతల పరిరక్షణ, ఆసియా – పసిఫిక్ ప్రాంత సముద్ర జలాలలో స్వేచ్ఛా నౌకాయాన హక్కులనేవి ఈ ప్రాంత దేశాలన్నింటి అవసరంగా వుంది. ఈ ప్రాంత దేశాల, ప్రజల హక్కుల, ప్రయోజనాల పరిరక్షకుడిగా, ఉద్ధారకుడిగా, ఏ అగ్రరాజ్యమూ వ్యవహరించరాదు. ఆధిపత్యం కోసం అగ్రరాజ్యాల మధ్య పోటీకి, శత్రుత్వానికి ఈ ప్రాంతం, ఈ ప్రాంత సముద్ర జలాలు స్థావరమయ్యేట్లయితే; ఈ ప్రాంతంలోని దేశాలు, ప్రభుత్వాలు తమ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతలను, ప్రజల హక్కులను, ప్రయోజనాలను బలిపెట్టి వీరి మధ్య పోటీలో సాధనాలుగా మారితే – ఈ ప్రాంత ప్రజల హక్కులు, ప్రయోజనాలు, శాంతిభద్రతలన్నీ తీవ్రమైన ప్రమాదంలో చిక్కుకునేందుకు అన్ని అవకాశాలున్నాయి.

ఇక్కడ భారతదేశ పాలకులు రెండు విధాల ఘోరమైన తప్పిదాలకు పాల్పడుతున్నారు. **మొదటి అంశం :** మనదేశ, ప్రజల ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, సామ్రాజ్యవాదులు మన ఆంతరంగిక విషయాల్లో ప్రత్యేకించి భారత – చైనా సరిహద్దు వివాదంలో జోక్యం చేసుకోవటానికి చొరబెడుతున్నారు. ఇది వివాద పరిష్కారాన్ని మరింత సంక్లిష్టంచేసేది మాత్రమే. సామ్రాజ్యవాదులు పీడిత జాతులకు, ప్రజలకు నమ్మకమైన మిత్రులుగా, మంచిని కాంక్షించేవారుగా ఏనాడూ లేరు; వుండరనే విషయం భారత ప్రజలకు తెలుసు. చర్చలద్వారా, శాంతియుత పద్ధతులద్వారా వివాద పరిష్కారానికి చేసే ప్రతి ప్రయత్నాన్నీ అమెరికా సామ్రాజ్యవాదులు భగ్నంచేస్తున్నారు. వారు ఇప్పటికే మనదేశంతో భారీస్థాయి ఆయుధ వ్యాపారం సాగిస్తూ, సైనికంగా మనదేశాన్ని తమకు లోబడిన బానిస దేశంగా కట్టిపడేశారు. ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో తమ ఆధిపత్య ప్రయత్నాలకు తోడ్పడే స్పష్టమైన లక్ష్యంతోనే చైనాతో మనదేశానికున్న విబేధాల పరిధిని ఆసియా – పసిఫిక్ ప్రాంతానికి విస్తృతపరిచారు.

**రెండవ అంశం :** అమెరికా నాయకత్వంలోని కూటమి 'QUAD'లో చేరటంద్వారా ఒక తప్పుడు కారణంకోసం చాలాపెద్ద, విధ్వంసకర విబేధంలోకి భారత పాలకులు ఈడ్వబడ్డారు. ఆసియా – పసిఫిక్ ప్రాంతంపైనా, ఆ ప్రాంత సముద్ర జలాలపైనా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే లక్ష్యంతో రూపొందించబడిన అమెరికా నాయకత్వంలోని ఈ కూటమిలో చేరటంద్వారా భారత పాలకులు ఈ ప్రాంతంలోని దేశాలకు, ప్రజలకు నమ్మకమైన స్నేహితునిగా వుండే హక్కు, అవకాశాలను కోల్పోవటమేగాక, వారితో శత్రుత్వాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు, దేశాలు తమ హక్కులను, ప్రయోజనాలను కాపాడుకునేందుకు; ఆసియా – పసిఫిక్ ప్రాంతాన్ని, సముద్ర జలాలను అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యంకోసం సాగించే శత్రుత్వాల నుండి, పోటీల నుండి, యుద్ధక్రీడల నుండి దూరంగా వుంచేందుకు – సాగించే ఉమ్మడి పోరాటాలలో భాగంగా వుండే అవకాశాన్ని భారత పాలకులు కోల్పోతున్నారు. ఈవిధంగా భారత పాలకులు అత్యంత ప్రమాదకరమైన మృత్యు వ్యూహంలోకి, అమెరికా ఆధిపత్య దుష్టక్రీడలోకి భారతదేశాన్ని, ప్రజలను నెడుతున్నారు. భారత దేశంలోని కార్మికవర్గం, రైతాంగం, ఇతర పీడిత ప్రజానీకం, ప్రజాస్వామికవాదులు, శాంతికాముక శక్తులంతా వీటన్నింటినీ సంపూర్ణంగా వ్యతిరేకిస్తూ ఉద్యమించాలి.

*******